





వలంటీర్లపై ఒత్తిడి

- రాజీనామాలకు పట్టుపడుతున్న వైసీపీ నాయకులు
- వ్యక్తిగత కారణాలను చూపుతూ వైదొలుగుతున్న వైనం
- వీరిని ఎన్నికల ప్రచారంలో వినియోగించుకోవాలని అధికార పార్టీ వ్యూహం

శృంగవరపుకోట మండలం ధర్మవరం మేజర్ పంచాయతీలో 24 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. వీరందరూ వైదొలగాలని అధికార పార్టీ నేత ఒకరు సూచించారు. దీంతో శుక్రవారం వ్యక్తిగత కారణాలను చూపుతూ వారంతా అధికారులకు రాజీనామా పత్రాలు అందించారు.

'మీ గ్రామాల్లో పని చేస్తున్న వలంటీర్లందరితో రాజీనామాలు చేయించండి. అనంతరం వారి పరిధిలోని ఇళ్లకు పంపించండి. సీఎం జగన్ చేసిన లబ్ధిని వివరించమనండి. ప్రతి ఇంట్లో ప్రతి ఓటు వైసీపీకు పడేలా అవగాహన కల్పించమనండి. తిరిగి మన ప్రభుత్వం రాగానే వలంటీర్లుగా నియమిస్తామని చెప్పండి' అంటూ ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధి గ్రామ స్థాయి నేతలకు తాజాగా ఇచ్చిన ఆదేశమిది.

లక్కవరపుకోట మండలంలోని ఓ వైసీపీ నేత తమ గ్రామానికి చెందిన వలంటీర్లందరూ రాజీనామా చేయాలని పట్టుబట్టాడు. వారితో మూకుమ్మడిగా రాజీనామాలు చేయించేందుకు శుక్రవారం మూహూర్తం పెట్టించాడు. వారికోసం మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక రామాలయం వద్ద నిరీక్షించిన ఆ నేత ఎంతకు రాకపోవడంతో విసుగు చెందిన వెళ్లిపోయారు. శనివారం కూడా కబురు పంపించారు. రాజీనామా చేసేందుకు ఇష్టం లేక అతనికి కనిపించకుండా తప్పించుకుతిరుగుతున్నారు.

శృంగవరపుకోట, ఏప్రిల్ 13: వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు జారీ చేస్తున్న హుకుంలతో అక్కడక్కడ వలంటీర్లు రాజీనామాలకు సిద్ధపడుతుండగా టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై ఇస్తున్న భరోసాపై నమ్మకం కలిగి కొందరు పునరాలోచనలో పడ్డారు. రాజీనామాలకు ఇష్టపడడం లేదు. అయితే అధికార పార్టీ నేతలు మాత్రం వారిపై నానాటికీ ఒత్తిడి పెంచుతున్నారు. ఎలాగైనా అందరినీ రాజీనామా చేయించాలనే పట్టుదలతో ఉన్నారు. అందుకు వివిధ మార్గాలను అనుసరిస్తున్నారు. వలంటీర్ బాగా నమ్మే వ్యక్తుల చేతి కూడా చెప్పిస్తున్నారు.

వైసీపీ అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా వున్న యువతకు అవకాశం కల్పించింది. నేతలు అనుకున్న వ్యక్తులకే వలంటీర్ పోస్టును ఇచ్చినప్పటికీ ఇంటర్వ్యూ పేరుతో ఆర్భాటం చేశారు. నియామకాలు అయ్యాక 50 కుటుంబాల నుంచి 70 కుటుంబాల బాధ్యతలను ఒక్కో వలంటీర్‌కు అప్పగించారు. ఆయా కుటుంబాలకు వీరి ద్వారానే సంక్షేమ పథకాల పేరుతో ప్రభుత్వం నగదు బదిలీ చేసింది. సర్వేలు చేయించింది. ఆయా కుటుంబాల వివరాలను కూడా తీసుకుంది. ఇలా గ్రామాలు, వార్డుల్లోని కుటుంబాలతో వలంటీర్లకు ఏర్పడిన పరిచయాల్ని ఎన్నికల ప్రచారానికి వాడుకొనేందుకు వైసీపీ చూస్తోంది. కొద్దిరోజులుగా కొందరు వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో నాయకుల వెంట తిరుగుతున్నారు. వారి ఆదేశాలను యథాతథంగా అనుసరిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఎన్నికల కమిషన్ సీరియస్ అయింది. ప్రభుత్వ ఖజానా నుంచి గౌరవ వేతనం పొందుతూ పార్టీ కార్యక్రమాలకు వెళ్లడంపై అభ్యంతరం తెలిపింది. కొందరిపై కేసులు కూడా నమోదు చేయించింది. అయినప్పటికీ వైసీపీ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనేలా ప్రజాప్రతినిధులు, నాయకులు నేటికీ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఏకంగా రాజీనామా చేయాలని ఒత్తిడి పెంచుతున్నారు. తద్వారా ఎన్నికల్లో లాభపడాలని చూస్తున్నారు. ఈ మేరకు పార్టీలో పైస్థాయి నుంచి కింది వరకు ఆదేశాలు జారీ అవుతున్నాయి. దీంతో చేసేదిలేక గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, నాయకులు వలంటీర్ల రాజీనామాల కోసం పట్టుబడుతున్నారు. 'జగనన్న మీకెంతో చేశారు. మళ్లీ సీఎంను చేస్తే మరింత లాభం చేస్తారు. కాబట్టి రాజీనామలు చేసి మీ పరిధిలోని కుటుంబాల వద్దకు వెళ్లండి. వైసీపీకి ఓట్లేసేలా చూడండి. అధికారంలోకి రాగానే తిరిగి మిమ్మల్నే వలంటీర్లుగా తీసుకుంటాం' అంటూ ఆశ చూపుతున్నారు. ఈ విషయాన్ని అందరూ నమ్మడం లేదు. రాజీనామా చేసినా తిరిగి మనల్నే తీసుకుంటారన్న గ్యారెంటీ లేనందున రాజీనామాలు చేయకూడదని, చంద్రబాబు వస్తే వేతనం కూడా పెంచుతామంటున్నారని చర్చించుకుంటున్నారు. ఉదాహరణకు శృంగ వరపుకోట మండలంలో ఇంతవరకు 31 మంది వలంటీర్లే రాజీనామాలు అందజేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎస్.కోట మేజర్ పంచాయతీలోనే 172 మంది వరకు వలంటీర్లు వున్నారు. ఈ గ్రామంలో ఇంతవరకు ఒక్క వలంటీరు కూడా రాజీనామా చేయలేదు. అక్కడక్కడ మాత్రమే అధికార పార్టీ నేతల ఒత్తిడిని తట్టుకోలేక అయిష్టంగా వైదొలుగుతున్నారు. కొన్ని మండలాల్లో చాలా తక్కువ సంఖ్యలో వలంటీర్లు రాజీనామా చేశారు.


రాజీనామా చేయాల్సిందే..

- వలంటీర్లకు వాట్సాప్‌లో హుకుం

బొబ్బిలి ఏప్రిల్ 13: 'మీరు శనివారం కల్లా రాజీనామా చేసెయ్యాలి. 35 ఏళ్ల దాటిన వారు కూడా రాజీనామా చేయాలి. అలాంటి వారందరికీ మళ్లీ వయోపరిమితి పెంచి రీ జాయిన్ చేసుకుంటారు. సో..టెన్షన్ పడాల్సిన అవసరం లేదు. మీరు రాజీనామా చేస్తే మళ్లీ మిమ్మల్నే జాయిన్ చేసుకుంటాము.. ఎంతమంది రాజీనామాకు సిద్ధంగా ఉన్నారో ఫాస్ట్‌గా చెప్పండి..' ఇదీ వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల్లో తాజాగా చక్కర్లు కొడుతున్న మెసేజ్.. వలంటీర్లంతా రాజీనామా చేయాలని తీవ్ర ఒత్తిడి తెస్తూ ఎస్‌టీఏ ప్రతినిధుల నుంచి హుకుం జారీ అవుతోందని పేర్లు వెల్లడించడానికి ఇష్టపడని పలువురు వలంటీర్లు విలేకరులకు శనివారం తెలిపారు. ఇంకొన్ని మెసేజ్‌లను కూడా ప్రస్తావించారు.

- 'మీ సచివాలయం నుంచి రాజీనామాల సమాచారం ఎవరూ ఇవ్వలేదంటే ఎవరికీ ఇష్టం లేదని అర్థమవుతోంది. ఈ విషయం పైవారికి తెలియజేస్తాం' అంటూ నేతలు హెచ్చరిస్తున్నారు.
- 'రాజీనామా చేసేవాళ్లే తర్వాత ఉంటారు, చేయనివాళ్ల ఉండరు. మీరంతా జగనన్న కోసం నిలబడతారనే ఉద్దేశంతోనే వర్క్‌లేని టైమ్‌లో కూడా జీతం ఇచ్చారు. ఏప్రిల్‌లో కూడా జీతం ఇవ్వడానికి రెడీ అయ్యారు. వినని వాళ్లను ఇంకెందుకు ఉంచుతారు... రాజీనామా చేసేవాళ్ల మాత్రమే ఉంటారు ఇది పక్కా' అంటూ తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని వలంటీర్లు వాపోయారు.

వలంటీర్లకు వాట్సాప్‌లో ఇచ్చిన ఆదేశాలు



రోడ్డుషో వాయిదా

- ప్రజాగళం యథాతథం
- 15న రాజాంకు చంద్రబాబు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ రాజాం టీడీపీ.. జనసేన అధినేతల రోడ్డుషో వాయిదా పడింది. మరోరోజు నిర్వహిద్దామని, త్వరలోనే తేదీ ఖరారు చేద్దామని శనివారం మధ్యాహ్నానికి కూటమి నేతలకు సమాచారం అందింది. దీంతో కాస్త నిరాశ చెందారు. ముందు ప్రకటించిన ప్రకారం ఈనెల 16వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు నెల్లిమర్ల, విజయనగరంలో రోడ్డుషో నిర్వహించాల్సి ఉంది. ఇందుకోసం స్థల పరిశీలన కూడా పూర్తి చేశారు. కాని అనివార్య కారణాలతో వాయిదా పడింది. మళ్లీ ఎపుడు నిర్వహించేది ప్రకటిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఈనెల 15న చంద్రబాబునాయుడు 'ప్రజాగళం' కార్యక్రమానికి యథావిధిగా రాజాం వస్తున్నారు. బహి రంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు.

చంద్రబాబు పర్యటన ఇలా..



టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రాజాం, పలాస పర్యటన షెడ్యూల్ ఖరారైంది. సోమవారం హైదరాబాద్ నివాసం నుంచి విమానంలో బయలుదేరి విశాఖ చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 2.40 గంటలకు రాజాం జీఎంఆర్‌లో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకొని 2.55 గంటలకు పాలకొండ రోడ్డులోని అంబేద్కర్ కూడలికి చేరుకుంటారు. అక్కడ 4.30 గంటల వరకు బహిరంగ సభలో మాట్లాడతారు. అనంతరం బయలుదేరి పలాసకు 5.15 గంటలకు చేరుకొని రోడ్‌షో నిర్వహిస్తారు.



నిర్మానుష్యంగా విజయనగరం మార్కెట్

అమ్మో ఎండలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 40 డిగ్రీలకు అటుఇటుగా నమోదు

విజయనగరం(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 13 : భానుడి ప్రతాపంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల దాటితే బయటకు రావడానికి భయపడుతున్నారు. జిల్లాలో అన్నిచోట్లా దాదాపు40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. వ్యవసాయ, ఉపాధి కూలీలు పనికి తిరిగి వెళ్లి ఇంటికి చేరేసరికి వేసారిపోతున్నారు. వృద్ధులు చాలా మంది పనులకు వెళ్లడం లేదు. పాఠశాలల నుంచి మధ్యాహ్నం తిరుగుముఖం పట్టే విద్యార్థులు శనివారం ఇక్కట్లు పడడం కనిపిం చింది. రెండో శనివారం అయినప్పటికీ చాలా వరకు పాఠశాలలు పనిచేశాయి. పిల్లలంతా భగభగ మండే ఎండలో అవస్థలు పడుతూ ఇంటికి చేరుకున్నారు. మార్కెట్‌లలో పనిచేసే కూలీలు ఎండకు తాళలేక ఇంటికే పరిమితమయ్యారు. మార్కెట్‌లు సాయంత్రం వరకు వెలవెలబోయాయి. ప్రధాన రహదారులు, జంక్షన్లు నిర్మానుష్యంగా కనిపించాయి. ఎండ తీవ్రతకు చెరువులు, వాగులు మైదానాలను తలపిస్తున్నాయి. ఆరుతడి పంటలు, ఉద్యాన పంటలకు గడ్డుకాలంగా మారింది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

పనితీరు చూసి ఓటు వేయండి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్‌గజపతిరాజు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి): వ్యక్తుల పనితీరును గుర్తించి ఓటు వేయాలని కేంద్ర మాజీ మంత్రి.. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు పి.అశోక్‌గజపతిరాజు కోరారు. నగరంలోని క్షత్రియ కల్యాణ మండపంలో శనివారం రాత్రి జరిగిన బ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటు సామాన్యుని చేతిలో బ్రహ్మాస్త్రమని, దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల న్నారు. మంచి పరిపాలన అందించే వారినే ఓటర్లు ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం అసెంబ్లీ అభ్యర్థి అదితి గజపతిరాజు పాల్గొన్నారు. అదితి మాట్లాడుతూ కక్షపూరిత పరిపాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.



అశోక్‌ను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

ఈవీఎంల కేటాయింపుపై ఆరా

- ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

నెల్లిమర్ల, ఏప్రిల్ 13: ఈవీఎంల కేటాయింపు ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను వివిధ నియోజకవర్గాలకు ఇప్పటికే కేటాయించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కంప్యూటర్ ఆధారంగా కలెక్టరేట్‌లో శుక్రవారం ఈ ఎంపిక జరిగింది. దీంట్లో భాగంగా ఈవీఎంల సీరియల్ నంబర్ల ప్రకారం వీటిని ఆయా నియోజకవర్గాల వారీగా వేరుచేసి స్కానింగ్ చేసే ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది. ఈ తంతును కలెక్టర్ శనివారం స్వయంగా పరిశీలించారు. ఆమె వెంట జేసీ కె.కార్తీక్, డీఆర్‌వో ఎస్‌డి అనిత, ఈవీఎంల గోదాం నోడల్ అధికారి ఉమాశంకర్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణ్ చక్రవర్తి, తహసీల్దార్ ధర్మరాజు, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఉన్నారు.





ఎన్నికల సారాంజామా

- తయారీకి ముందస్తు ఆర్డర్లు ఇస్తున్న నాయకులు
- కేటగిరీల వారీగా మద్యం పంపకాలకు ప్రణాళికలు
- బ్రాండెడ్.. చీప్ లిక్కర్.. సారా సేకరణకు విస్తృత ఏర్పాట్లు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఈ ఎన్నికల్లో మద్యం కోసం కోటి రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోందని ఓ రాజకీయ పార్టీ నాయకుడు నర్మగర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో చెప్పాడు. గతంలో ఎన్నికలు వస్తే నెల రోజులు ఖర్చు చేసినా మద్యం కోసం మహా అయితే రెండు లక్షల రూపాయలు సరిపోయేవని, ఇపుడు తెగ తాగేస్తుండడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదన్నాడు. ఇదే నాయకుడు నాటుసారాకు కూడా ఆర్డర్ ఇచ్చాడని అనుయాయులు తెలిపారు. రాజకీయ నాయకులు ఖర్చు తగ్గించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా మద్యం కన్నా సారాను ఎక్కువగా తెప్పించాలని భావిస్తున్నారు. ముందు చూపు మరీ ఎక్కువై అక్కడక్కడ ఎక్సైజ్ అధికారులకు దొరికిపోతున్నారు. ఇప్పటికే కార్యకర్తలు.. నాయకులతో పాటు ప్రచారంలో పాల్గొంటున్న వారిని ప్రలోభాలతో ముంచెత్తుతున్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఖర్చు భారీగా పెరగనుందని అంచనాకు వచ్చి సారాపై దృష్టిపెడుతున్నారు.

నామినేషన్ల ఘట్టం తరువాత ప్రతిరోజు రూ.30నుంచి రూ.50వేలు ఖరీదు చేసే నాటు సరుకును సిద్ధంగా ఉంచాలని కొందరు నేతలు తమ అనుచరులకు ఆదేశాలు ఇచ్చారు. మద్యం అమ్మకాలపై ఎన్నికల సంఘం ఎంత ఖఠినంగా వ్యవహరించినా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా సారాను సిద్ధం చేసుకుంటున్నారు. అభ్యర్థులతో తిరుగుతున్న ద్వితీయ శ్రేణి నాయకులకు బ్రాండెడ్ మద్యం అందిస్తున్నారు. కార్యకర్తలకు మద్యం షాపుల్లో లభ్యం అయ్యే చీప్ లిక్కర్ అందిస్తున్నారు. ప్రచారం కోసం తిప్పుతున్న వారికి నాటుసారా అందిస్తున్నారు. ఇలా ఉన్నత, మిడిల్, లో అనే మూడు కేటగిరీలుగా మద్యం పంపకాలు సాగుతున్నాయి.

రహస్య ప్రదేశాలకు నిల్వలు


మద్యం అమ్మకాలపై నియంత్రణ కారణంగా నామినేషన్ల తరువాత మద్యం దొరకదన్న అనుమానంతో రాజకీయ నాయకులు మద్యం నిల్వలను పెద్దఎత్తున దాచేస్తున్నారు. ముందుగానే నిల్వలను కొనుగోలు చేసి రహస్య ప్రదేశాలకు తరలిస్తున్నారు. మద్యానికి కృత్రిమ కొరత ఏర్పడనున్న కారణంగా సారాను ప్రత్యామ్నాయంగా వాడుకునేందుకు కూడా వ్యూహం పన్నారు. నాటు సారా వంటకాలు మొత్తం ఏజెన్సీ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. అయితే వంటకాలు ఏజన్సీ(ఒడిశా) లోనూ... దిగుమతి మైదాన ప్రాంతాలకు అన్నట్లు వ్యవహారం సాగుతోంది. ఒడిశా సరిహద్దుల్లో వంటకాలు నిర్వహించి మన జిల్లాలోని పట్టణ ప్రాంతాలకు సారా తరలుతోంది. మెంటాడ, బొబ్బిలి, సాలూరు మీదుగా రామభద్రపురం, ఒడిశాలోని బందుగాం వయా పార్వతీపురం మీదుగా బొబ్బిలి, విజయనగరం ప్రాంతాలకు సారా చేరుకుంటోంది. సారా తరలించేందుకు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. పట్టు బడకుండా జాగ్రత్త పడుతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో ఓ తహసీల్దార్ వాడుతున్న అద్దెకారు డిక్కీలో సారా తరలించారు. సమాచారం లీక్ అవ్వడంతో అడ్డంగా దొరికిపోయారు. ఇప్పుడు కూడా అలాంటి మార్గాల్లోనే ఎక్కువగా సారా తరలుతోందని తెలుస్తోంది.

ప్రాణాంతకం అయినా..

సారా ప్రాణాంతకమని వైద్యులు ఘోషిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఒకప్పుడు ఇప్పమొగ్గను పులియబెట్టడం ద్వారా సారా తయారు చేసేవారు. ఇప్ప మొగ్గ లభ్యం కాకపోవటం, బాగా సమయం తీసుకోవటంతో ఈ విధానానికి స్వస్తి పలికారు. ప్రస్తుతం నల్ల బెల్లంలో యూరియా, నవ్వాసారం, బ్యాటరీల్లో ఉండే నల్లని గుండను వేసి పులయబెడుతున్నారు. దీనిని వేడి చేయటం ద్వారా వచ్చిన ఆవిరిని చల్లార్చి సారా తయారు చేస్తున్నారు. ఇది ఇప్పమొగ్గతో తయారు చేసిన దానికంటే కిక్కు అధికంగా ఇస్తుంది. కాని రసాయనాలు విచ్చలవిడిగా వాడుతున్న కారణంగా ప్రాణాంతకమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

సముద్రంలో వేటకు విరామం

● రెండు నెలలపాటు అమలు ● రేపటి నుంచి బోసిపోనున్న తీరం



భోగాపురం

సముద్రంలో మత్స్యసంపద పెంపొందించేందుకు రెండునెలల పాటు వేట విరామం సోమవారం నుంచి ప్రారంభంకానుంది. వేట సాగించే మత్స్యకారులు, మత్స్యసంపద కొనుగోలు చేసుకొనేవారితో తీరం నిరంతరం కలకలలాడేది. చేపల వేట నిషేదం అమల్లోకి రానుండడంతో తీరం బోసి పోనుంది. సోమవారం నుంచి 61 రోజులపాటు సముద్రంలో చేపలవేట చేయకూడదని ప్రభుత్వం నిషేధాజ్ఞలు జారీచేసింది. వేటనిషేధానికి సంబంధించి గ్రామాల్లో మత్స్యకార సిబ్బంది మత్స్యకారులకు అవగాహన కల్పించారు. రొయ్యలు, చేపలు సంతానోత్పత్తి సమయం కావడంతో తల్లి చేపలు, తల్లిరొయ్యలను సంరక్షించడానికి వాటి ఉత్పత్తిని పెంచడానికి మత్స్యసంపద అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం 61 రోజుల పాటు వేటనిషేధం ఏటా అమలు చేస్తోంది. దీంతో మెకనైజడ్, మోటరైజ్ బోట్లు సముద్ర జలాల్లో చేపలవేట చేయ రాదు. వేట నిషేదం అమలు నేపథ్యంలో మత్స్యకారులు మరబోట్లను, వలలు, వేట సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. విలువైన పరికరాలను ఇళ్ల వద్ద భద్రపరచుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం, చింతపల్లి, పతివాడ, తిప్పవలస, కోనాడ, కొల్లాయివలసల్లో 3,400 కుటుంబాలు ప్రత్యక్షంగా, మరో 1600 కుటుంబాలు పరోక్షంగా సముద్ర మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్నాయి. వేటనిషేధం అమలు కానుండడంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడనున్నాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న బోట్లకు మాత్రమే ప్రభుత్వం రూ.10వేలు చొప్పున భృతి మంజూరు చేయనుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న బోట్లలో తీరంలో ఉంచిన బోట్లను మాత్రమే గణన చేసి వారికి మాత్రమే భృతి అందజేయనున్నారు. వేట నిషేధ సమయంలో మర బోట్లతో వేటకు వెళ్తే ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకోనుంది. సంప్రదాయ పడవలు మాత్రం వేట నిషేధ సమయం సముద్రంలో ఎనిమిది నాటికల్ మైళ్ల దూరంలోపల మాత్రమే వేటసాగించుకోవచ్చు. సోమవారం నుంచి వేటనిషేదం అమలు కానుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

వేటనిషేధం పక్కాగా అమలు చేస్తాం..

ఈనెల 15నుంచి జూన్ 14వరకు 61 రోజుల పాటు సముద్రంలో తల్లిచేపలు, రొయ్యలు సంతానోత్పత్తి జరుగుతుందని మత్స్యశాఖ ఉపసంచాలకులు ఎన్.నిర్మలకుమారి తెలిపారు. మత్స్యసంపద ఉత్పత్తి, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వేట నిషేదం అమలు చేస్తుందని చెప్పారు.. వేట నిషేదం పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. నిషేధ ఆజ్ఞలు ఉల్లఘించిన బోటు యజమానులపై ఏపీఎంఎఫ్ఆర్ చట్టం-1994 ప్రకారం బోట్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

25 కిలోల వెండి ఆభరణాల స్వాధీనం



పట్టుబడిన వెండి వస్తువులను పరిశీలిస్తున్న సీఐ మోహనరావు

రాజాం రూరల్: మండలంలోని పొగిరి చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా బస్సులో తరలిస్తున్న 25 కిలోల వెండి ఆభరణాలను రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు స్వాధీనం చేసుకున్నారు. విశాఖ నుంచి పాలకొండ వెళ్తున్న బస్సును ఎస్ఐ రవికిరణ్, సిబ్బందితో తనిఖీచేశారు.రెండు బ్యాగుల నిండుగా ఉన్న వెండి ఆభరణాలను పోలీసులు గుర్తించారు. చెక్‌పోస్ట్‌లోనే ఆభరణాలను తూకం వేయించి 25 కిలోలు ఉన్నట్లు నిర్ధారించారు. వీటి విలువ మార్కెట్ ధర ప్రకారం సుమారు రూ.20 లక్షలు ఉంటుందని అంచనావేశారు. అయితే వెండ వస్తువులను బస్సులో తరలిస్తున్న ప్రయాణికుడి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ మోహనరావు దర్యాప్తు చేస్తున్నారు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన వెండి

గజపతినగరం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో ద్విచక్ర వాహనంలో ఏడుకిలోల వెండి పట్టుబడినట్టు సీఐ ఎస్‌వీ ప్రభాకరరావు శనివారం తెలిపారు.గజపతినగరం పట్టణం నుంచి నాలుగురోడ్ల జంక్షన్ వస్తున్న ద్విచక్రవాహనాన్ని తనిఖీచేయగా, 7కిలోల 450 గ్రాముల వెండి ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. పట్టుబడిన వెండికి సంబంధించి వాహన యజమాని చక్రధర్ వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో జిల్లా గ్రీవెన్స్ కమిటీకి పంపించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

42 మద్యం సీసాలు ...

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంతంలో అక్రమంగా మద్యం రవాణా చేస్తుండగా పట్టుబడ్డ నిందితుల నుంచి 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. కోమటిపలిలో మంతెన సింహాచలం నుంచి 1,800 రూపాయల విలువ చేసే 12 మద్యం సీసాలు, పాతబొబ్బిలి జంక్షన్‌లో గునుపూరు అప్పలనాయుడు నుంచి 2,980 రూపాయల విలువ చేసే 20 మద్యం సీసాలు, చింతల సత్యనారాయణ నుంచి 1500 రూపాయల విలువ చేసే 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఏఎస్ఐలు రమణ, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రామభద్రపురం: మండలంలోని చందాపురం గిరిజన శివారు ప్రాంతంలో శనివారం పోలీసులు జరిపిన దాడుల్లో 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు.సారా తయారుచేయడానికి సిద్ధంగా ఉంచిన బెల్లంఊటను ధ్వంసించేసి ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నామనిచెప్పారు. దాడుల్లో కానిస్టేబుళ్లు నారాయణరావు, మట్టయ్య పాల్గొన్నారు.

పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 527 లీటర్లు..

పార్వతీపురంటౌన్: పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న సారాను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కృష్ణారావు తెలిపారు. సీఐ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు ఏఎస్పీ సునీల్ నరైన్ ఆధ్వర్యంలో పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 8 సారా కేసుల్లో స్వాధీనం చేసుకున్న 527 లీటర్ల సారాను పట్టణ శివారుల్లో ధ్వంసం చేశామని సీఐ చెప్పారు. ఎవరైనా సారా తయారుచేయడంతోపాటు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● **వీరఘట్టం:** మండలంలోని గంగంపేట, రాజపురం గ్రామాల మధ్యలో సారా తరలిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని 60 లీటర్ల సారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

విజయనగరం క్రైం: నగరంలో శనివారం ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐలు లోవరాజు, మహేశ్వరరాజు, సిబ్బంది ప్రధాన కూడళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. త్రిబుల్ రైడింగ్, వాహనపత్రాలు, లైసెన్సులు లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

● **శృంగవరపుకోట రూరల్:** మండలంలోని వెంకటరమణపేట వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలు తనిఖీచేసింది. ఈ మార్గంలో రాకపోకలు చేసే ప్రతి వాహనం ఆపి క్షుణంగా సిబ్బంది పరిశీలించారు.

గడ్డి కుప్పలు దగ్ధం

మక్కువ: మండలంలోని కోన గ్రామంలో రెండు వరిగడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి.శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో పైనున్న విద్యుత్ వైర్లు ఒకదానికొకటి అంటుకుని పక్కనే ఉన్న మరిశర్ల సీతంనాయుడు, వాకాడ సత్యంకు చెందిన రెండు వరి గడ్డికుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను కొంతవరకు అదుపు చేసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పక్కనే మరో 15 గడ్డికుప్పలతో పాటు ఇళ్లు కూడా ఉన్నాయి. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పామాయిల్ తోటకు నిప్పు

కొమరాడ: సీతామాంబపురం (అగ్రహారం) గ్రామానికి సమీపంలో వేసిన పామాయిల్ తోటకు నిప్పంటుకోవడంతో తోట మొత్తం ధ్వంసమైంది. తోటలో నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. దీంతో రైతు విశ్వేశ్వరరావు లబోదిబోమంటున్నారు. మొక్కలకు నీటి సౌకర్యం కల్పించేందుకు డ్రిప్ ఏర్పాటు చేసుకోవడానికి వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికి వస్తుందన్న తరుణంలో తోటకు నిప్పంటుకోవడంతో కాపు (గెలలు) కూడా వచ్చే అవకాశం లేదని అన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ఎన్నికల్లో పీవోలదే కీలక పాత్ర

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల

బొబ్బిలి:ఎన్నికల నిర్వ హణలో పీవోలదే కీలక పాత్ర అని ఎన్నికల అధి కారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల తెలిపా రు. శనివారం బొబ్బిలి గొ ల్లపల్లి శ్రీవేణుగోపాల ము నిసిపల్ పాఠశాలలో పోలింగ్ అధికారులకు ని ర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణా ధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియలపై పూర్తి స్థాయిలో అవ గాహన ఉండాలన్నారు.పోలింగ్ ముగిసిన తరువాత సమర్పించాల్సిన ఫార్మాట్ విష యంలో జాగ్రత్తలను పాటించాల న్నారు. ఎక్కడా రీపోలింగ్‌కు అవకాశం రానీయ కుండా పక్కాగా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పని తీరుపై పీవోలు, ఏపీవోలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలు, సాంకేతిక అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఓటరు ఓటుహక్కు వినియోగించుకునేం దుకు సుమారు ఏడు సెకెండ్లు పడుతుందని, దీని ఆధారంగా అవసరమైన ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని, పోలింగ్‌కు 90 నిమిషాల ముందే మాక్‌పోల్ నిర్వహించాలని చెప్పారు. మాక్ పోలింగ్ తరువాత వాటిని ఈవీఎంల నుంచి వెంటనే తొలగించాలన్నారు. మాక్‌పోలింగ్ నిర్వహించకపోతే పోలింగ్ రద్దయ్యే అవకాశముందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు త్రినాథరావునాయుడు, సులోచనరాజారావు, డీటీలు రెడ్డి సాయికృష్ణ, ఎంఈవో గొట్టాపు వాసు, మాస్టర్ ట్రైనీలు జేసీ రాజు, సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జామిలో అక్కమ్మ, ఎర్రమ్మ పేరంటాలు తీర్థం

జామి: జామిలో రైతులు తమపొలాల్లో ఏరువాక పూజలు చేశాక సంప్రదాయం బద్ధంగా అక్కమ్మ, ఎర్రమ్మపేరంటాలు తీర్థం నిర్వహించి వారికిపూజలుచేశారు. అమ్మవార్లకు పసుపుకుంకాలు సమర్పించి అన్నదానంచేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● బొబ్బిలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి బేబీనాయన



తారకరామాకాలనీలో ప్రచారం చేస్తున్న బేబీనాయన, సుజయ్, తెంటు

బొబ్బిలి: విజన్ కలిగిన చంద్రబాబు హయాంలో మళ్లీ సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోగమని బొబ్బిలి నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన) తెలిపారు.శనివారం స్థానిక తారకరామా కాలనీలోమాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడులతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, పాలూరు బాబు, లంక రమేష్, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రాంబా ర్కి శరత్‌బాబు, వాసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు పువ్వల శ్రీనివాసరావు, సాయిరమేష్ పాల్గొన్నారు.

● **తెర్లాం:** మండలంలోని చీకటిపేట, పూనువలస, పెదపాలవలసలో బొబ్బిలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, నాయకులు ముడడ్ల పార్వతి, చీకటి తిరుపతి, సరస్వతి, వెంకటేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు మరడాన రవి, యుగంధర్,సర్పంచ్ జవాన రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ బెదిరింపులకు లొంగవద్దు

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుజయ్‌కృష్ణ రంగారావు

బొబ్బిలి: వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు చేస్తున్న బెదిరింపులు, ఒత్తిళ్లకు వలంటీర్లు ఎట్టి పరిస్థితుల్లో లొంగవద్దని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సుజయ్ కృష్ణరంగారావు తెలిపారు. శనివారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లకు సంబంధించి మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. సీఎం జగన్ ధనబలంతో అందర్నీ కొనుగోలు చేయాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, సుంకరి సాయిరమేష్, సుంకర సత్తిబాబు, మున్నా పాల్గొన్నారు.

●**రామభద్రపురం:**వైసీపీని తరిమికొట్టినప్పుడే రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుజయ్‌కృష్ణరంగారావు తెలిపారు. బూసాయవలసలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా ఎన్డీయే కూటమి విజయంసాధిస్తుందన్నారు.సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతి నాయుడు, టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు పాల్గొన్నారు.

170 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

రాజాం: రాజాంలోని శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో 170 కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి.రాజాం మండలంలోని అంతికాపల్లికి చెందిన 70 కుటుంబాలు, రేగిడి మండలంలోని ఆడవరం లక్ష్మీపురానికి చెందిన 20, వన్నలి, వెంకంపేట గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు చొప్పున, వంగర మండలంలోని బంగారువలసకు చెందిన 20 కుటుంబాలకు రాజాం నియోజకరవ్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కండువాలువేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని దివాళా తీసేస్థాయికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుమల వెంకట, మన్మథరావు, కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు,పాలూరి రామినాయుడు, ఎస్.అప్పలనాయుడు, హరిచందక రాము, మజ్జి శ్రీను, వెంకటరావు,రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాగళం సభను విజయవంతం చేయండి

ప్రజాగళం సభను వియవంతం చేసేలా అందరు కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కోరారు. శనివారం రాత్రి పురపాలక సంఘం పరిధిలోని కొత్తవలసలో అభయాంజనేయస్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం మాట్లాడుతూ సోమవారం జరిగే చంద్రబాబునాయుడు రోడ్‌షో, ప్రజాగళం సభ విజయవంతం చేయాలని కోండ్రు కోరారు.

సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

బాడంగి: మండలంలోని కోడూరు గొల్లవీధిలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను శనివారం విజయనగరం టీడీపీ పార్లమెంట్ బీసీ సాధికారిత సమితి కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరిపి రమేష్, కొల్లి సత్యారావు, కొల్లి చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా ప్రజా వ్యతిరేక పాలన

● విజయనగరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు



30వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: ఐదేళ్ల వైసీపీ పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందని విజయనగరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు ఆరోపించారు. శనివారం విజయనగరం కార్పొరేషన్‌లోని 30వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా తనను, కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని కోరారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇంటర్ చదివే విద్యార్థినుల కోసం కలలకు రెక్కలు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, దీంతో విద్యార్థినులకు ఉన్నత చదువులకు అవకాశం లభిస్తుందని వివరించారు.కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ: కోళ్ల



శృంగవరపుకోట రూరల్: ధర్మవరంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

శృంగవరపుకోట: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఎస్.కోట నియోజకరవ్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఆరోపించారు. శనివారం శృంగవరపుకోట గాంధీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, టీడీపీ నాయకులు జీ.ఎస్ నాయుడు, రెడ్డి వెంకన్న, కొణదం మల్లేశ్వరరావు, వాకాడ బాలు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

●**శృంగవరపుకోట రూరల్:** మండలంలోని ధర్మవరంలో మాజీ సర్పంచ్ వైసీపీ నేత గొర్లె దేముడు ఆధ్వర్యంలో 50 ఎరుకుల, 50 యాత కుటుంబాలు వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి లలితకుమారి, సుధారాజు,గొంప కృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాలు వైసీపీని బంగాళాఖాతంలో తోసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్ర మంలో సర్పంచ్ గాలి సన్యాసయ్య, జీఎస్ నాయుడు,రెడ్డి వెంకన్న, రాయరవపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, న్యాయవాది మండా కామేశ్వరరావు పాల్గొన్నారు.

●**వేపాడ:**వేపాడకు చెందిన వైసీపీ నాయకుడు భోజంకి లక్ష్మణరావు శుక్రవారం రాత్రి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పల రాంప్రసాదు సమక్షంలో టీడీపీలో చేరారు. సింగరాయిలో శుక్రవారం రాత్రి జయహో బీసీ నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు నిరుజోగి దాలినాయుడు, రంభ శంకరరావు, సూరి దేముడు, నిరుజోగి బంగారునాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి పాల్గొన్నారు

ఎన్నికలు సజావుగా జరగాలి: కలెక్టర్

శృంగవరపుకోట: ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు సహకరించాలని కలెక్టర్ నాగ లక్ష్మి కోరారు. శనివారం శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవోలు, ఏపీవోలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ, సహాయ ఎన్నికల అధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి: జేసీ



మాట్లాడుతున్న కార్తీక్

రాజాం: ఎన్నికల విధులు పీవోలు సక్రమంగా నిర్వహించి మంచి గుర్తింపును తీసుకురావాలని జేసీ కార్తీక్ కోరారు. శనివారం రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో పీవోలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోషఫ్, తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్, ప్రత్యేకాధికారి బి.సుధాకర్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొమరాడ:గ్రామాల్లో జ్వరాలు, వ్యాదులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు ఆదేశించారు. శనివారం కళ్లికోటలో పర్యటించారు.జ్వరలక్షణాలతో ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. ఇళ్లలో దోమతెరల వినియోగంపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్‌రావు స్థానిక హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో రికార్డులు తనిఖీచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, పీహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది రామకృష్ణ, నరేంద్ర పాల్గొన్నారు.

మందుబాబులకు అగచాట్లు

● స్టాకు ఉన్నా లేదని పంపించేస్తున్న సిబ్బంది

మెంటాడ: మెంటాడలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది మందుబాబులకు అగచాట్లు తప్పడంలేదు. దుకాణం లోపల స్టాక్ ఉన్నా బయట షోకేసులను ఖాళీగా చూపుతున్నారని పలువురు వాపోతున్నారు.ఒక వ్యక్తి ఒక సీసా చొప్పున మాత్రమే అని చెప్తున్న సిబ్బంది.. పని వేళలను గాలికొదిలి వారికి నచ్చిన సమయంలోనే విక్రయాలు జరుపుతున్నారని మద్యం కొనుగోలుదారులు చెబుతున్నారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరచి ఉండాల్సిన షాపులు రోజు మొత్తమ్మీద రెండు మూడు గంటలకు మించి పనిచేయడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో శనివారం షాపుల ముందు మద్యం ప్రియులు గంటల తరబడి క్యూలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో మాత్రం కావాల్సినన్ని సీసాలు లభ్యమవుతున్నాయని, బెల్ట్ దుకాణాల నిర్వాహకులు ఇచ్చే కమీషన్‌కు కక్కుర్తిపడి సరుకును దొడ్డిదారిన తరలిస్తున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. బీర్లు స్టాక్ ఉన్నా ఫ్రిజ్‌లో పెట్టడం లేదని చెబుతున్నారు.అలాగే, ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ నేతల ఇళ్లకు పథకం ప్రకారం ముందుగా తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తక్షణమే మద్యం విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మెంటాడలో మద్యం షాపు వద్ద ఎగబడుతున్న మందుబాబులు

సాగునీరు విడుదలచేయాలి

● మడ్డువలస కాలువలో రైతులు నిరసన

రాజాం: మడ్డువలస రిజర్వాయర్ నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలని సంతకవిటి మండలం పొనుగుటివలస, తలతంపర, బిల్లాని, బొద్దూరు గ్రామాల రైతులు డిమాండ్‌చేశారు. శనివారం బిల్లాని మడ్డువలస కాలువ వద్ద ఆయకట్టు రైతులు గేదెల నారాయణరావు, గాదం అన్నారావు, సలిది కృష్ణ, గొర్లె కూర్మినాయుడు, గొర్లె పెదగు రినాయుడు, మందపల్లి ధర్మారావు, భీర మల్లేష్, గంగిరెడ్డి సీతంనా యుడు, పలిశెట్టి రమణ, గొర్లె శ్రీరాములునాయుడు, శాసపు సింహాచలం తదితరులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు విడుదలచేయకపోవడంతో మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కాలువల ద్వారా నీరందుతుందని ఆశపడి పంటలు వేశామని, నీరు విడుదల చేయకపోవ డంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. నీటివిడుదలపై మడ్డువలస ప్రాజెక్టు అధికారులను కోరినా స్పందించలేదని, కలెక్టర్ చర్యలు తీసుకుని సాగు నీరు విడుదల చేయాలని కోరారు.



బిల్లానిలో మడ్డువలస కాలువ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

చెరువులు, గెడ్డలు కబ్జా నిజం

● అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ గౌరీశంకర్ ధ్వజం

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/విజయనగరం రూరల్ : విజయనగరంలో చెరువులు, గెడ్డలు కబ్జాకు గురయ్యాయని, ఎమ్మెల్యే కోలగట్ల అనుచరులు ఇందులో కీలక సూత్రధారులని అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ ఆరోపించారు. శనివారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ కోలగట్ల అనుచరుల భూ ఆక్రమణలను తాను సాక్ష్యాలతో నిరూపిస్తానన్నారు. నగరంలోని పురాతన రాజమన్నార్ గోపాలస్వామి ఆలయ భూములను కొల్లగొట్టారన్నారు. ఈ భూములకు సంబంధించి లేఅవుట్లు వేశారని.. వాటిలో స్థలాలు కొనుగోలు చేసిన వారు సైతం ఆ భూములు కోల్పోయారన్నారు. 200 సర్వే నెంబరుకు సంబంధించిన స్థలాలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే కోలగట్ల భూ వ్యాపార భాగస్వామి బొట్టా భాస్కరరావు దీనిలో ప్రధాన సూత్రధారి అన్నారు. 2019 నుంచి 2024 మార్చి నెలాఖరు వరకూ విజయనగరం నియోజకవర్గంలో భూ దందాలు జరిగాయన్నారు. స్థలం లేకుండా ఉత్తుత్తి పట్టాలను ఎన్నికల ముందు నిరుపేదలకు అందించడం అలవాటుగా మారిందని విమర్శించారు. నగర శివార్లలోని జమ్ము ప్రాంతంలో నగరంలోని 4, 5, 6, 7 డివిజన్ల నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. ఇళ్ల పట్టాల్లో పేర్కొన్న స్థలానికి సంబంధించి యాజమాని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం నుంచి స్టే తెచ్చుకున్నారన్నారు. దీంతో పట్టాలు ఇచ్చినా లబ్ధిదా రులకు స్థలం చూపించడం ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ సమావేశంలో అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ గాడు అప్పారావు, టీడీపీ నాయకులు శంకరరావు, పట్నాయకుని మోహన్ పాల్గొన్నారు.

కూలి గిట్టుబాటు కాలేదని నిరసన


నిరసన తెలుపుతున్న కూలీలు

లక్కవరపుకోట (కొత్తవలస): ఉపాధిహామీ పనుల కూలి గిట్టుబాటు కావడం లేదని దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన 450 మంది కూలీలు శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కొలతల పేరుతో కోతలు పెడుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త పనులకు 300 రూపాయలని పేర్కొని మోసం చేశారని మండిపడ్డారు. ఇటువంటి రేట్లతో ఎవరూ పనిచేయలేరని అసంతృప్తి వ్యక్తం చేశారు. వేసవి అలవెన్స్‌లు తీసివేసి రేట్లు పెంచినట్లు మసిబూసి మారేడుకాయ చేశారని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నేత గాడి అప్పారావు మండిపడ్డారు. సోమవారం కూలీలంతా ఎంపీడీవో కార్యాలయం ఎదుట తమ నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

నిరంకుశ ధోరణిని విడనాడాలి


బెయిలుపై వచ్చిన మిమ్స్ ఉద్యోగులను సత్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం దాసన్నపేట: నెల్లిమర్ల మిమ్స్ ఉద్యోగులు తమ న్యాయ మైన సమస్యలు పరిష్కరించాలని కోరితే, యాజమాన్యం నిరంకుశ ధోరణి అవలంభిస్తూ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం హేయమైన చర్య అని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. యాజమాన్యం కారణంగా ఇటీవల జైలుకి వెళ్లి బెయిల్‌పై వచ్చిన ఈశ్వరమ్మ, లక్ష్మి, రమణ, రాజశేఖర్‌లకు కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాజమాన్యం, అధికార యంత్రాంగం, పోలీసు వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తప్పు యాజమాన్యం చేస్తే కార్మికులను.. అందులో మహిళలను నిర్బంధించడం జిల్లా ప్రతిష్టను దిగజార్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, యూనియన్ ప్రతినిధులు జగన్మోహన్‌రావు, మిరపా నారాయణరావు, కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మద్యపాన నిషేధం ఎక్కడ?

● **లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి**


మాట్లాడుతున్న భీశెట్టి

విజయనగరం దాసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే దశల వారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తానని ఇచ్చిన హామీ ఎక్కడని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ప్రశ్నించారు. శనివారం ఆర్ అండ్‌బీ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీ చేయకపోగా... రాష్ట్రంలోని యువతను మద్యం, గంజాయి మత్తుకు బానిసలుగా చేశారన్నారు. పర్యాటక ప్రదేశాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సునీల్ కుమార్, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేలకు మించి తరలిస్తే పత్రాలు తప్పనిసరి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

బొండపల్లి: ఎన్నికల నేపథ్యంలో రూ.50వేలకు మించి తీసుకు వెళ్తే తప్పనిసరిగా అందుకుతగ్గ పత్రాలు ఉండాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు సూచించారు. మండల కేంద్రం వద్ద శనివారం జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన అనుమతి పత్రాలు లేని రూ.లక్షా 65వేలను ఇటీవల సీజ్ చేశామని తెలిపారు. అలాగే వాహనాల్లో నగదును గానీ, ఏమైనా వస్తువులను గానీ తరలించినప్పుడు తప్పనిసరిగా అందుకు తగ్గ పత్రాలను తీసుకుని రావాలన్నారు. ఈ తనిఖీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇక్కడ వృథ.. అక్కడ వృథా

మక్కువ: మండలంలోని నంద గిరిజన గ్రామంలో కొళాయిలు ద్వారా తాగునీరు వృథాగా పోతుంది. రక్షిత మంచినీటి పథకానికి నీరు నింపే సమయంలో కొళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు కాలువల్లోకి పోతుంది. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు భూగర్భజలాలు తక్కువ అవుతున్న సమయంలో నీటిని పొదుపు చేయాల్సింది పోయి వృథాగా వదిలేస్తూ ఉండడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడే ఆస్కారముందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కొళాయిలకు ట్యాప్‌లను అమర్చాలని కోరుతున్నారు. **గంట్యాడ:** ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి.. తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న సందర్భాలు ఉన్నాయి. రామవరం గ్రామంలోని తాగునీటి కొళాయిలకు కొన్ని చోట్ల ట్యాప్‌లు లేకపోవడంతో తాగునీరు వృథా అవుతుంది. దీంతో ఎంతో విలువైన తాగునీరు వృథాగా పోతుంది. చాలా రోజులు ఈ సమస్య ఉన్నా పరిష్కారం కాలేదు. వెంటనే కొళాయిలకు ట్యాప్‌లు లేని చోట కొత్తగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


దత్తిరాజేరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న మహిళలు

నీటి ఎద్దడిని నివారించండి

దత్తిరాజేరు: చిన్నరాజేరులో మంచినీటి కొరత తీవ్రంగా ఉందని గ్రామానికి చెందిన పలువురు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. 4 నెలలుగా రక్షిత మంచినీటి పథకం నుంచి నీరు రావడం లేదని, పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్నాథపురం తాడేంద్రవలస, ఇంగిలాపల్లి తదితర గ్రామాల్లో కూడా ఇదే సమస్య ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.


మక్కువ మండలం నంద, గంట్యాడ మండలం రామవరంలో కొళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో వృథాగా పోతున్ననీరు

ప్రజల కష్టాలు వైసీపీకి ఏం తెలుసు?

● **చీపురుపల్లి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు**


ప్రచారంలో పాల్గొన్న కళా వెంకటరావు

గుర్ల: ప్రజల కష్టాలు వైసీపీకి ఏం తెలుసునని చీపురుపల్లి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు ప్రశ్నించారు. మండలంలోని ఎస్ఎస్ఆర్.పేట నుంచి మంజపూర్‌పేట, దమరసింగి, వల్లాపురం గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. రైతులు తోటపల్లి నీరు కోసం అష్టకష్టాలు పడుతుంటే కాలువల పూడికతీత పనులు కూడా చేపట్టలేదని కళా విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వి.సన్యాసినాయుడు, సీహెచ్. మహేశ్వరరావు, పిల్లా అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాగమాధవి

భోగాపురం: పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామానికి చెందిన బోర్ల వెంకటేష్, మహంతి కోదండ రామనాయుడు, మహంతి నితీష్ కుమార్ తమ అనుచరులతో కలిసి కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దాష్టీకాలను ఓర్చుకోలేక.. కుంటుపడిన అభివృద్ధిని చూసి జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

లోప భూయిష్టంగా సింగిల్ విండో విధానం

● **ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్**

బొబ్బిలి: నూతన విద్యాసంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానం లోప భూయిష్టంగా ఉందని, దీనిని ఆసరాగా చేసుకుని యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సాయికిరణ్‌యాదవ్ ఆరోపించారు. శనివారం బొబ్బిలిలో విలేకర్లతో మాట్లాడుతూ భవన నిర్మాణాలు పూర్తికాకుండానే అనుమతులు వచ్చాయని చెప్పి అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. డోర్ నెంబరు విష యంలో అవకవతవకలకు పాల్పడుతున్నారని, ఫైర్ సేఫ్టీ అనుమతి పత్రం ఇందులోనే కలపడంతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నట్లేనన్నారు. అధికారులను మోసం చేసి నిబంధనలకు విరుద్ధంగా విద్యా వ్యాపారం సాగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి మణికుమార్, సతీష్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాలపై ప్రభుత్వం సిగ్గుపడాలి

● **లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు దామోదరరావు**

బొబ్బిలి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్ష ఫలితాలు చాలా దారుణంగా ఉన్నాయని, వీటిని చూసి రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు తెలిపారు. శనివారం బొబ్బిలిలో విలేకర్లతో మాట్లాడుతూ విద్యామంత్రి బొత్స సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఫలితాల స్థాయి 19వ స్థానానికి పడిపోవడం సిగ్గుచేటు చేటన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద, బడుగు వర్గాల వారికి నాణ్యమైన విద్యనందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా.. అని ప్రశ్నించారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చామని, ప్రపంచస్థాయి ప్రమాణాలు అమలు చేస్తున్నామని డబ్బాలు కొట్టుకుంటున్న ప్రభుత్వం ఈ ఫలితాలపై ఏమని బదులిస్తారన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికైనా ప్రభుత్వ కళాశాలలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

ఒత్తిడికి గురిచేసే సంస్థలపై చర్యలు తీసుకోవాలి

● **ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న**

బొబ్బిలి: విద్యార్థులను మానసికంగా, ఆర్థికంగా ఒత్తిడికి గురిచేస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ డిమాండ్ చేశారు. శనివారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ ఫీజుల కోసం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను వేధిస్తే ఆయా విద్యాసంస్థల ముందు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఫీజుల కోసం విద్యార్థులను మానసి కంగా వేధిస్తున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. విద్యార్థులను బయట నిలబెడుతున్నారని, హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. పుస్తకాలు, యూనిఫారాలు, హాస్టళ్ల పేరుతో విద్యార్థుల నుంచి పెద్దఎత్తున డబ్బులను గుంజుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

వడదెబ్బపై అవగాహన


వేపాడ: అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వేపాడ: సోంపురం నర్సిపల్లి మెట్టలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొన్న వేతనదారులకు శనివారం బొద్దాం పీహెచ్‌సీ ఆరోగ్య కార్యకర్త పి.మూర్తి ఆధ్వర్యంలో వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తీసుకోవల్సిన జా గ్రత్తలను వివరించారు. ● **లక్కవరపుకోట(కొత్తవలస):** కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీలోని దుంపవానిచెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు శనివారం వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 10 గంటల్లోపు సాయంత్రం నాలుగు గంటల తరువాత పనులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్యారావు, నాగరాజు పాల్గొన్నారు.

కొలతల్లో ప్రామాణికత పాటించాలి


వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో

రేగిడి: ఉపాధి వేతనదారులు కొలతల్లో ప్రామాణికత పాటిస్తే వేతనం రూ.300 గిట్టుబాటు అవుతుందని ఉపాధి ఏపీవో ఎస్.హరనాథ్ సూచించారు. నాయిరాలవలస ఎర్రవానిచెరువులో ఉపాధి పనిని శనివారం ఏపీవో తనిఖీ చేశారు. మస్తర్లను పరిశీలించారు. ఒకరికి బదులు ఇంకొకరిని పనికి అనుమతించకూడదని, ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరు నమోదు చేయాలని సూచించారు. రెండుపూటలా పని చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఉపాధి ఎఫ్ఏ శ్రీనివాసరావు, మేట్లు ఉన్నారు.

అచ్చెన్నను కలిసిన ఆనంద్‌కుమార్

నెల్లిమర్ల: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును ఆ పార్టీ నెల్లిమర్ల మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ శనివారం ఆయన స్వగృహం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో కలిశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయనకు వివరించారు. ఆనంద్ తోపాటు ప్రసాద్ ఉన్నారు.

కర్రోతును కలిసిన కలిశెట్టి


కలిశెట్టిని సన్మానిస్తున్న దృశ్యం

భోగాపురం: టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణను పోలిపల్లి గ్రామంలోని ఆయన స్వగృహంలో కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు శనివారం కలిశారు. ఈసందర్భంగా తన గెలుపునకు కృషి చేయాలని కలిశెట్టి కోరారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని, ప్రచారంలో భాగంగా తనతో పాటు కలిశెట్టికి కూడా ఓటు వేయాలని కోరుతానని చెప్పారు. అనంతరం కలిశెట్టిని కర్రోతు సత్యనారాయణ, కర్రోతు రాజు కుటుంబ సభ్యులు సన్మానించారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

డెంకాడ: మండలంలోని అక్కివరం, మోదవలస, చింతలవలస సబ్ స్టేషన్ల పరిధిలోగల గ్రామాలకు సోమవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డెంకాడ ఏఈ అప్పలనాయుడు శనివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. ● **భోగాపురం:** ముక్కాం విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ ఎస్‌కే మస్తాన్ వల్లి శనివారం తెలిపారు. ముక్కాం, ముంజేరు, రామచంద్రపేట, కొంగవానిపాలెం, మెట్టసబ్బన్నపేట, నందిగాం, తోటపల్లి, దిబ్బలపాలెం, చేపలకంచేరు, బమ్మిడిపేట, గాబువానిపేట, కొండ్రాజుపాలెం, జగ్గయ్యపేట గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని చెప్పారు.

నేడు రాజాంలో..

రాజాం: గోపాలపురం సబ్ స్టేషన్ నిర్వహణ పనులు చేపడుతుండడంతో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రాజాంలోని పలు వీధులతో పాటు కంచరాం, రాజీయ్యపేట, ఆగూరు, దోసరి, దోసరి రామినాయుడవలస గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


మాట్లాడుతున్న సీఐ

బొబ్బిలి: ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు కోరారు. శనివారం చింతాడలో గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎటు వంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అధికా రులు, పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

పోలీసుల కవాతు


కవాతు చేస్తున్న పోలీసులు

చీపురుపల్లి: ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం కవాతు నిర్వహించారు. సీఐ సీహెచ్.షణ్ముఖరావు నేతృత్వంలో సుమారు 50 మంది సిబ్బంది కవాతులో పాల్గొన్నారు. పట్టణంలోని జి.అగ్రహారం, వంగపల్లిపేట, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కవాతు చేశారు. ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు, ఆర్‌పీఎస్ఎఫ్ సీఐ ఎల్.ఆర్.జాత్, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు కరపత్రం ఆవిష్కరణ

శృంగవరపుకోట: ఓటర్లు చైతన్యం కలిగి ఉండాలని శృంగవరపు కోటకు చెందిన వైద్యుడు ఆర్.త్రినాధరావు తెలిపారు. శనివారం స్థానిక దేవిబొమ్మ కూడలిలో ఓటరు అక్షరాస్యత వేదిక ఆధ్వర్యంలో ఓటరు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్య క్రమంలో ఓటరు చైతన్య వేదిక వ్యవస్థాపకుడు దొడ్డి సూర్యారావు, వేదిక ప్రతినిధులు న్యాయవాది చంద్రశేఖర్, రిటైర్డ్ తహసీల్దార్ వి. సన్యాసప్పడు, లంక సాంబమూర్తి, సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ ప్రారంభోత్సవం


ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గుర్ల: భూపాలపురం గ్రామంలో నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.